క్లుప్తంగా

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను సాగుకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ బుధవారం చెప్పారు. మండలానికి మొత్తం 114 క్వింటాళ్ల జనుములు, 104 క్వింటాళ్ల జీలుగలు, 37 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు ఆయా రైతు భరోసా కేంద్రాలకు రావటం జరిగిందన్నారు. ఆ మేర ఇప్పటి వరకు 40 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో సంబంధిత వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

క్రోసూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమవుతున్నట్లు ఎంఈవో ఏకుల ప్రసాదరావు తెలియజేశారు. మండలంలో మొత్తం 59 ప్రభుత్వ పాఠశాలలు, నాలుగు ప్రైవేటు పాఠశాలలున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంపీపీ, ఎంపీయూపీ, జెడ్పీ పాఠశాలలు, కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ ఉన్నట్లు చెప్పారు. వీటిలో 3,060 మంది బాలికలు, 2,710 మంది బాలురు మొత్తం 5,770 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు తెలిపారు. వీరందికి కావాలిసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు 70 శాతం వరకు అందుబాటులోకి వచ్చినట్లు ఎంఈవో తెలిపారు.

అన్నపూర్ణాదేవికి చండీ పారాయణం



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి సహిత గంగా అన్నపూర్ణా సమేత మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వేడుకలను జరిపించారు. రెండవరోజు ప్రధాన పూజాధికాల్లో భాగంగా అన్నపూర్ణాదేవి అమ్మవారిని స్తుతిస్తూ వేద పండితులు చండీ పారాయణం చేశారు. పలురకాల విశేష ద్రవ్యములతో స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. అమ్మవారిని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో పాల్గొని స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

క్షయవ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించుకోవాలి

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి



రెంటచింతల: క్షయ వ్యాధి (టీబీ) నివారణకు వ్యాక్సిన్ వేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి కోరారు. బుధవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం 60 సంవత్సరాలు పైబడిన వారికి, పొగతాగే వారికి, షుగర్ ఉన్న వారికి, 5 సంవత్సరాల కిందట టీబీ ఉన్న వారికి.. వారి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీలో, విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా క్షయవ్యాధి నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి

మాచవరం : పిడుగుపాటుకు గురై యువ రైతు మృతి చెందిన ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన యువ రైతు సంకురాత్రి రామస్వామి (34) పొలంలో వ్యవసాయ పనులు చేసేందుకు తన సొంత ట్రాక్టర్‌తో వెళ్లాడు. పొలంలో ట్రాక్టర్ సహాయంతో వ్యవసాయ పనులు చేస్తుండగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. ట్రాక్టర్‌ను పొలంలో ఆపి చెట్టు కిందకు వెళ్లే సమయంలో పిడుగుపాటుకు గురై పడిపోవటంతో పక్క పొలంలో ఉన్న రైతు చూసి ఘటనా స్థలానికి చేరుకునేసరికి మృతి చెంది ఉన్నాడు. విషయం తల్లిదండ్రులకు తెలియజేశాడు. మృతునికి భార్య, పిల్లలు గాయత్రి, పవన్‌లు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్

రొంపిచర్ల: స్థానిక బీసీ కాలనీలో గల మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖా ధికారులు వై.ఏసుబాబు, డి.బ్రహ్మేశ్వరరావు లు మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 4,399 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ వచ్చాయన్నారు. మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చిన వీటిని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

బడికి పోదాం.. చలో

- నేటి నుంచి తెరుచుకోనున్న విద్యా సంస్థలు
- మధ్యాహ్న భోజన సరుకుల పంపిణీ పూర్తి
- జేవీకే కిట్ల పేరును స్టూడెంట్ కిట్లుగా మార్పు
- నియోజకవర్గంలో 230 పాఠశాలలు, 22,482 మంది విద్యార్థులు
- కొత్త విద్యాసంవత్సరానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



గుడిపూడిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

సత్తెనపల్లి: వేసవి సెలవులు ముగిశాయి. 45 రోజులపాటు విద్యార్థులు అమ్మఒడికి పరిమితమై ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. గడిపారు. ఆట, పాటలు, అల్లర్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారితో ఆనందంగా గడిపారు. అమ్మ ఒడి నుంచి చదువులమ్మ ఒడికి చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. పాఠశాలలు ప్రారంభమంటేనే విద్యార్థులకు ఓ పండుగ. కొత్త కాంతులు విరజిమ్మే పసిన వ్వుల ముఖాలతో సరస్వతి ఆలయాల మెట్లు ఎక్కే బాలబ్రహ్మలు గుర్తొస్తారు. ఎంత తేజస్సో.. కొత్త యూనిఫాం చూసుకొని మురిసిపోతూ.. కొత్త పుస్తకాల బ్యాగును భుజాన వేసుకొని బుడి బుడి అడుగులతో పాఠశాల గేటు దాటుతుంటారు. కొత్త పాఠ్య పుస్తకం తెరిచి చూస్తే వచ్చే సుగంధం ఎందరో నేటితరం విద్యార్థులకు అనుభవమే. కొందరు.. గేటు దాకా అమ్మ కొంగు పట్టి ఏడ్చుకుంటూ మారం చేస్తూ వస్తారు. వచ్చాక అక్కడి తన లాంటి పిల్లల్ని చూసి వారితో ఆటల్లో పడిపోతారు. అదో చూడముచ్చటైన సన్నివేశం. లోపలికి వెళ్లాక ప్రభుత్వం ఇప్పటికే అందజేసిన కొత్త బ్యాగ్, పుస్తకాలు, షూస్, డిక్షనరీ, తదితర వస్తువులతో కూడిన కిట్టును చూసి మురిసిపోవడం కొత్త విద్యా సంవత్సరానికి అదనపు ఆకర్షణ. విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు చిత్తశుద్ధితో అవసరమైన పుస్తకాలు సమకూర్చారు. గతంలో వీటిని జగనన్న విద్యా కానుకగా పిలిచేవారు. ఇప్పుడు స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చి పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బడి తెరిచిన రోజునే విద్యార్థులకు వీటిని అందించేలా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. కొత్తగా అడ్మిషన్లు పొందిన వారికి సైతం తొలి రోజే కిట్‌లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

వసతులు, విద్యార్థులు ఫుల్...

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. సర్కార్ బడుల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయి. ఆధునిక విద్యాభ్యాసం కొనసాగించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం చేరుతున్నారు. పాఠశాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బల్లలు, డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ట్యాబ్‌లతో పాటు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, షూ, బెల్ట్‌లు అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు పొందే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.



సత్తెనపల్లిలో సిద్ధంగా ఉన్న స్టూడెంట్ కిట్‌లు, నోట్ పుస్తకాలు

నియోజకవర్గంలో 230 సర్కార్ బడులు..

సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లోని పలు గ్రామాల్లో 230 ప్రాథమిక, ప్రాథమి కోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, తదితర పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 22,482 మంది విద్యార్థులు విద్యాభ్యాసం పొందుతున్నారు. బడులు తెరిచిన తర్వాత కొత్తగా చేరే వారితో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు.

నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థులు, స్టూడెంట్ కిట్‌లు ఇలా...

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	స్టూడెంట్ కిట్‌లు
సత్తెనపల్లి	93	9,903	9,903
ముప్పాళ్ల	35	2,837	2,837
రాజుపాలెం	55	4,438	4,438
నకరికల్లు	47	5,304	5,304
మొత్తం	230	22,482	22,482

విద్యాశాఖ సూచనలు...

- తరగతి గదులు, వంటగది, స్టోర్ రూములను ఆయాల సహకారంతో పరిశుభ్రం చేయించాలి. వంట గదిలో గోడల మధ్య బూజులు, బొద్దింకలు, ఎలుకలు వంటివి లేకుండా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.
- పాఠశాల పాయింట్లకు వస్తున్న కోడిగుడ్లు, చిక్కీలు, రాగి, బెల్లం పిండి నిల్వ ఉన్నట్లు గమనిస్తే ప్రధానోపాధ్యాయులు తీసుకోకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి.
- పాఠశాల యందు గల మంచినీటి సరఫరాకు సంబంధించిన ఓవర్ హెడ్, సంపు ట్యాంక్‌ల్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించి, ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయించాలి.
- టాయిలెట్ల క్లీనింగ్ విషయంలో ఆయాలచే పాఠశాలలకు సరఫరా చేసిన కెమికల్స్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకం, టాయిలెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ రిజిస్టర్లు క్రమం తప్పకుండా నిర్వహణను 13వ తేదీ నుంచే నిర్వహించాలి.

బాలకార్మిక వ్యవస్థను అంతం చేద్దాం

రాజుపాలెం: బాలకార్మిక వ్యవస్థను అంతం చేద్దామని దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకర్రావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని కొండమోడు గ్రామం పరిధిలోని వీరమ్మకాలనీలో గల దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ హోమ్ కేర్ సెంటర్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం క్రీడాపోటీలు నిర్వహించి ప్రతిభను చాటిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. చిల్డ్రన్ హోంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, చిల్డ్రన్ హోం కేర్ విద్యార్థులు

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఎస్‌ఐ ఆంజనేయులు

రెంటచింతల: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు బుధవారం తెలిపారు. మండలంలోని తుమృకోట, రెంటాల, పాలువాయిగేటు, మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాలలో 110 మంది ప్రత్యేక దళాలు, మరో 30 మంది ఏఆర్ పోలీసు సిబ్బందితో ఏర్పాటు చేసిన పికెట్ కొనసాగుతుందన్నారు. సమస్యాత్మక గ్రామాలలో నెలకొన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ఈ గ్రామాలలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం ఏర్పడటానికి ప్రజలందరూ పూర్తిగా పోలీసులకు సహకరించాలన్నారు. ప్రతి చిన్న విషయానికి ఆవేశంలో ఘర్షణలకు పాల్పడితే మీ కుటుంబాలు అన్ని విధాలా నష్టపోతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా.. లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కల్గిస్తూ ఎవరైనా విద్వేష పూరిత సందేశాలు, ఫొటోలు, వీడియోలు, పోస్ట్ చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తుమృకోట గ్రామంలో పోలీసు పికెట్

రెడ్‌క్రాస్ సొసైటీకి సహకరించండి

నూతన ఎమ్మెల్యే అరవిందబాబును కోరిన సంస్థ ప్రతినిధులు

నరసరావుపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ కార్యకలాపాలకు సహాయ సహకారాలు అందజేయాలని నూతన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును ఆ సంస్థ ప్రతినిధులు కోరారు. బుధవారం శాసనసభకు ఎన్నికైన ఆయనను జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో తమ సొసైటీ ఇప్పటి వరకు చేసిన, చేస్తున్నటు వంటి సేవా కార్యక్రమాలను వాటి పురోగతి, బ్లడ్‌సెంటర్ స్థితిని గురించి వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సొసైటీ సేవలు మరింత విస్తరించాలని కోరారు. వైస్ చైర్మన్ పీవీ ఎం.శరత్ బాబు, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస గుప్తా, మురళి, లైఫ్ మెంబరు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబును అభినందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకులు అభినందనీయం

లక్ష్మీపురం: జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత కఠినమైన పరీక్షల్లో ఒకటిగా భావించే జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకుల్లో తొలి 100లో 26 తెలుగు రాష్ట్రాలకే రావడం మనకందరికీ గర్వకారణమని తెలిపారు. కౌన్సెలింగ్‌కి అర్హత పొందిన మొత్తం 11,180 మందిలో తెలుగు రాష్ట్రాల నుంచి ఏడు వేల నుంచి ఎనిమిది వేల వరకు ఉంటారంటే తెలుగు విద్యార్థుల ప్రభావం జాతీయ స్థాయిలో ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.

గీతమ్స్ హైస్కూల్ విద్యార్థినికి సత్కారం



వినుకొండ(నూజెండ్ల): చింతలచెరువు సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు సీహెచ్. రఘు మాస్టారు ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులతో టాన్‌ఫస్ట్ సాధించిన పి. ఇష్రాత్ ఫాతిమాకు ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. అనంతరం విద్యార్థిని ఫాతిమాను, ట్రస్ట్ సభ్యులను, పాఠశాల డైరెక్టర్ సీహెచ్. నారాయణ రావును దుశ్శాలువా, పూలమాలలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ధూళిపాళ్ల నాగేశ్వరరావు, జీవీ మాధవరావు, ఎం.వి.శర్మ పాల్గొన్నారు.

బావిలో పడి గొర్రెలకాపరి మృతి



నరసరావుపేట రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండలంలోని రంగారెడ్డిపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. చిలకలూరిపేట మండలం కోమటినేని వారిపాలెం గ్రామానికి చెందిన యంపరాల శివగోపి(18), మరో ఇద్దరు గొర్రెలను మేత కోసం రంగారెడ్డిపాలెం వైపు తీసుకువచ్చారు. మధ్యాహ్నం 3గంటల సమయంలో శివగోపి తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. బావిలో దిగే క్రమంలో కాలుజారి బావిలో పడి మునిగిపోయాడు. శివగోపి తిరిగి రాకపోవడంతో మిగిలిన ఇద్దరు గొర్రెల కాపరులు బావి వద్ద గాలించారు. ఫలితం లేకపోవడంతో జొన్నలగడ్డలోని బంధువులకు సమాచారం అందించారు. వారు బావిలో గాలించగా శివగోపి మృతదేహం లభించింది. మృతదేహన్ని స్వగ్రామం కోమటినేని వారిపాలెంకు తరలించారు.

పిడుగురాళ్లలో వర్షం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో బుధవారం వర్షం పడింది. ఉదయం మొత్తం తీవ్రమైన ఉక్కపోతతో కుడిన ఎండ కాసింది. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఒక మోస్తరు వర్షం పడింది. ఇప్పటి వరకు కొంత మంది రైతులు పత్తి విత్తనాలు నాటి మొలక దశలో ఉన్నాయి. అదే విధంగా కొంత మంది రైతులు భూమి దున్ని విత్తనం విత్తేందుకు సిద్ధంగా ఉన్నారు. సాయంత్రం వరకు ఎండ కాయటం సాయంత్రం వర్షం పడటంతో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం లభించింది.

పాలిటెక్నిక్ కళాశాలలో సీఎం ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం

క్రోసూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం మండలంలోని ప్రభుత్వ అధికారులు వీక్షించేందుకు క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేసినట్లు బుధవారం పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య తెలిపారు. మండల రెవెన్యూ, మండల పరిషత్ అభివృద్ధి, వివిధ శాఖల అధికారులు హాజరై కార్యక్రమాన్ని వీక్షించటం జరిగిందని చెప్పారు.



ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు

క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలి



సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు

- ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు
- సత్తెనపల్లిలో ముగిసిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్
- 42 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్ల ప్రదానం

సత్తెనపల్లి: విద్యార్థులు క్రీడలకు చదువుతో సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కారంగుల సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 2024 ఏప్రిల్ 24 నుంచి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు నిర్వహించిన స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి పీడీ షేక్ మహమ్మద్ రియాజ్ అధ్యక్షత వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడం ద్వారా శారీరక సామర్థ్యం మరింత పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి పల్నాడుకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. పాఠశాల రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చింతపల్లి వెంకటాద్రి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకునే ఆత్మవిశ్వాసం క్రీడల ద్వారా వస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పట్టుదల వీడొద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువు, క్రీడలు రెండింటిలోనూ రాణించాలన్నారు. హిందీ ఉపాధ్యాయుడు రజాక్, పీఎస్ ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇచ్చి వారిని తీర్చిదిద్దిన ఫిజికల్ డైరెక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. ముందుగా స్పోర్ట్స్ సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన 42 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు డి.శ్రీనివాసరావు, ఎ.శ్రీరామిరెడ్డి, ఎస్ఎం.సుభాని, ఎం.నరసింహారావు, రాజేశ్వరి, క్రీడాకారులు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఫుట్‌బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఉపాధి హామీ పనులకు అవాంతరాలు కల్పించవద్దు

వ్యవసాయ కార్మిక సంఘం

క్రోసూరు: అన్ని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వెంటనే ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం క్రోసూరు మండల కమిటీ సమావేశం ఆమంచి విజ్ఞాన కేంద్రంలో మండల అధ్యక్షులు గంటెల చిన్నప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమయంలో ఒక వారం, కౌంటింగ్ సందర్భంలో ఒక వారం ఉపాధి హామీ పనులకు అవాంతరాలు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రస్తుతం కౌంటింగ్ అయిపోయిన తర్వాత గ్రామాల్లో పనులు చేయించాల్సినటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వం మారింది కాబట్టి బాధ్యతలో మేము ఉంటామో లేదో అనేటటువంటి సందిగ్ధతతో పనులను ఆపడం జరిగిందని తెలిపారు. దీనివల్ల మండలంలోని ఎక్కువ గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయని అన్నారు. దీనివల్ల ప్రజలకు గ్రామాలకు ఆర్థికంగా నష్టం చేకూరుతుందని అందుకని వెంటనే గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు నాలుగు వారాలుగా వేతనాలు రావాల్సి ఉన్నదని వేతనాలు కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 200 రోజులు పని దినాలు వేతనం రూ.500 పెంచుకోవడానికి సంఘాన్ని బలపరుచుకోవటానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఏపూరి వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు జడ పేతురు, జేరిపోతు శంకర్, కత్తుల గోపికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు..లాభాలు బాగు

ఉద్యాన శాఖ అధికారి మోహన్



రెంటచింతల: డ్రిప్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడం వలన రైతులు అధిక లాభాలు పొందవచ్చని గురజాల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. బుధవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన ఎంతో అవసరమన్నారు. పండ్ల మొక్కలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఉద్యాన శాఖ అధికారుల ద్వారా తెలుసుకుని చేపట్టాలన్నారు. 5 ఎకరాలలోపు ఉన్న రైతులు, నీటి వసతి ఉన్న వారు, బావి బోరు కలిగిన వారు ఈ డ్రాగన్ ఫ్రూట్ సాగు రాయితీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేసే రైతులకు ఒక హెక్టార్‌కు రూ.30 వేల రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. 3 సంవత్సరాల నుంచి పంట ఎకరాకు 5 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. లోకల్ మార్కెట్లో కేజీ రూ.150 వరకు ఉంటుందని ఎగుమతి చేస్తే బహిరంగ మార్కెట్‌లో దీని ధర కేజీ రూ.200 నుంచి రూ.220 వరకు పలుకుతుందన్నారు. ఈ డ్రాగన్ ఫ్రూట్స్‌కు ఔషధ గుణాలు ఎక్కువగా ఉన్నాయని ఈ పండ్లను తినడం ద్వారా గుండె జబ్బులు, క్యాన్సర్, థైరాయిడ్‌ను నిరోధించే శక్తి ఉందన్నారు. జీర్ణశక్తిని కూడా ఈ పండు పెంచుతుందన్నారు. పల్నాడు జిల్లాలో రెంటచింతల, పులిపాడు, గురజాల, దాచేపల్లి, కారంపూడి, వేమవరం, మాచవరం, వినుకొండ, క్రోసూరు, నరసరావుపేట తదితర ప్రాంతాలలో ఇప్పటికే సుమారు 100 ఎకరాలలో ఈ డ్రాగన్ ఫ్రూట్స్ పంటను రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం నిమిత్తం 90 శాతం, 5 ఎకరాల నుంచి 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు 70 శాతం, 10 ఎకరాల నుంచి 20 ఎకరాలకు పైబడిన రైతులకు 50 శాంత రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఎంతో కాలంగా ఈ ప్రాంత రైతులు మిర్చి, పత్తి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారని దీంతో భూమిలో పోషక విలువలు తక్కువగా ఉన్నాయన్నారు. పండ్ల తోటల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ ప్రాంతంలో రైతులు నూతన ఉద్యాన పంటలైన ఎర్ర జామ, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను అధికారుల సూచనలతో పెంపకం చేపట్టాలన్నారు. పండ్ల తోటల పెంపకం వలన రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు.